క్లుప్తంగా

జూట్‌మిల్లు తెరిపించండి..

నెల్లిమర్ల: నెల్లిమర్ల జూట్‌మిల్లును తెరిపించి, కార్మికులకు పెండింగ్ బోనస్‌లు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు విశాఖపట్నం లోని లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన చర్చలకు జూట్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకుడు కిల్లంపల్లి రామారావు, ఇఫ్టూ నాయకుడు సీహెచ్ గోవిందరావు హాజరై కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అయితే మిల్లు యాజమాన్యం చర్చలకు హాజరుకాకపోవడంతో చర్చలను ఈ నెల 30కి వాయిదా వేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు కె. కరువులు, కె. అప్పలసూరి, ఎస్. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సొంత భవనం ఏర్పాటు చేయండి



ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మిని సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు జస్వంత్, సాయి, లీలా కుమార్, ప్రవీణ్, మనోజ్‌కుమార్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం కోరల్లో తీరప్రాంత గ్రామాలు

- జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజగోపాల్



కాలుష్యంపై ప్రజలతో మాట్లాడుతున్న పర్యావరణ యాత్ర బృంద సభ్యులు రాజగోపాల్, నిర్మల, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని తీరప్రాంత గ్రామాలు కాలుష్యంతో అతులాకుతలం అవుతున్నాయని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజగోపాల్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఉత్తరాంధ్ర పర్యావరణ యాత్రలో భాగంగా మండలంలోని అల్లాడ పాలెం, కొణతాలపాలెం, చోడవరం గ్రామాలలో సోమవారం పర్యటించారు. ఆయా గ్రామాల సమీప నదిలో పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలు కలుస్తుండడాన్ని గుర్తించారు. శ్రీకాకుళం జిల్లా సరిహద్దుల్లో ఉన్న ఫార్మా పరిశ్రమల కాలుష్యంతో ప్రజలు విలవిల్లాడుతున్నారని చెప్పారు. భూగర్భ జలాలు కలుషితం కావడంతో ప్రజలు వింత వింత వ్యాధులతో అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ యాత్రలో గుర్తించిన అంశాలను అధికారులు, ప్రజాప్రతినిధులకు త్వరలో తెలియజేస్తామని చెప్పారు. ఆయనతో పాటు జనవిజ్ఞాన వేదిక సభ్యులు పి.రమణప్రభాత్, చీకటి దివాకర్, కె. మురళీ బాబు, సీహెచ్ సింహాచలం, శశిధర్, నిర్మల, చిన్నారి, తదితరులు పాల్గొన్నారు.

మరో బాదుడుకు సిద్ధం..

- వచ్చే నెల ఒకటో తేదీ నుంచి భారీగా పెరగనున్న రిజిస్ట్రేషన్ ధరలు
- ఇప్పటికే పడిపోయిన రియల్ ఎస్టేట్ వ్యాపారం
- జిల్లా పరిధిలో 13 రిజిస్ట్రార్ కార్యాలయాలు
- 24వ తేదీ వరకు అభ్యంతరాలకు గడువు
- జిల్లా కమిటీ ఆమోదం లాంఛనమే



దాసన్నపేటలోని రిజిస్ట్రార్ కార్యాలయం

విజయనగరం రూరల్: భూములు, స్థలాలు, నిర్మాణాల విలువలను అమాంతం పెంచేందుకు ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు పూర్తి చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పక్కనబెట్టి వరుసగా ప్రజలపై మోయలేని భారాలు మోపుతోంది. ఒక పక్క నిత్యావసర ధరలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతుంటే.. మరోపక్క విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజల నడ్డివిరిచిన కూటమి ప్రభుత్వం తాజాగా భూముల మార్కెట్ విలువ రిజిస్ట్రేషన్ చార్జీలను భారీగా పెంచేందుకు సిద్ధమైంది. 2025 నూతన సంవత్సర కానుకగా ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచనున్నట్లు సమాచారం.

కొత్తగా నిర్ణయించిన ధరలు		
నిర్మాణం	పట్టణం	పంచాయతీ
అపార్ట్‌మెంట్	రూ. 1490	రూ. 900
సెల్లార్ పార్కింగ్	960	640
3వ అంతస్తు నుంచి	1,520	920
వాణిజ్యభవనం కింద అంతస్తు	1800	1060
మొదటి అంతస్తు	1700	1010
రెండవ అంతస్తు నుంచి	1590	950
సెల్లార్ పార్కింగ్	1040	740
షాపింగ్‌మాల్స్, మల్టీప్లెక్స్	1590	950
సినిమాహాల్స్, కర్మాగారాలు	950	690
మిల్లులు, ఫౌల్ట్రీఫారాలు	రూ.690	రూ.490

భారీగా పెరగనున్న ఆర్‌సీసీ నిర్మాణాల ధరలు

కొత్త నిబంధనల ప్రకారం ఆర్‌సీసీ నిర్మాణాల ధరలు భారీగా పెరగనున్నాయి. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలోని అపార్ట్‌మెంట్‌లలో మొదటి, రెండవ అంతస్తులలో ప్లాటుకు ఒక్కో చదరపు గజానికి రూ.90 పెరగనుంది. ఇప్పటివరకు చదరపు అడుగుకు రిజిస్ట్రేషన్ విలువ రూ.1400 ఉండగా దీన్ని ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి రూ. 1490కి పెంచనున్నారు. కొన్ని మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లోనూ చదరపు అడుగుకు రూ.70 పెంచుతున్నారు. మూడో అంతస్తు నుంచి మాత్రం గతంలో వసూలు చేసే రేట్లనే కొనసాగిస్తున్నారు. వాణిజ్య భవనాలకు మాత్రం గతంతో పోల్చిచూస్తే రిజిస్ట్రేషన్ విలువ రూ.100 పెరగనుంది. ధరల పెంపునకు సంబంధించి ఇప్పటికే సంబంధిత అధికారులు రంగం సిద్ధం చేశారు.

వచ్చే నెల ఒకటి నుంచి..



భూములు, భవన నిర్మాణంగానికి సంబంధించి రిజిస్ట్రేషన్ ధరలు పెంచేలా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ఈ నెల 24వ తేదీ వరకు ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తాం. జిల్లాలో ఉన్న 13 రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అభ్యంతరాలు స్వీకరించనున్నారు. 27న తుది జాబితా ప్రచురిస్తాం. – నాగలక్ష్మి, జాయింట్ సబ్ రిజిస్ట్రార్, విజయనగరం

ఫిబ్రవరి ఒకటి నుంచి అమలు..

ఆదాయం పెంచుకోవడమే పరమావధిగా కూటమి ప్రభుత్వం జిల్లాలో భూములు విలువల పెంపునకు సిద్ధమైంది. ఈ మేరకు జిల్లా అధికారులు పెంపు నివేదికలను సిద్ధం చేసి ముసాయిదాను జిల్లాలో ఉన్న 13 రిజిస్ట్రార్ కార్యాలయాల నోటీస్ బోర్డులో ఉంచారు. ఈ నెల 24 వరకు ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తారు. 26న వాటిని పరిశీలిస్తారు. ఈ నెల 27న తుది జాబితాకు జిల్లా మార్కెట్ విలువల కమిటీ ఆమోదం తెలియజేయనుంది.

వ్యాపారం పడిపోతుంది..



ఇప్పటికే కుదేలైన రియల్ ఎస్టేట్ వ్యాపారం రిజిస్ట్రేషన్ ధరల పెంపుతో పూర్తిగా పడిపోతుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ రంగం బాగుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రియల్ ఎస్టేట్ వ్యాపారాలు తగ్గిపోయాయి. ఇప్పుడు తాజా ధరల పెంపుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కోలుకోలేని పరిస్థితికి జారిపోయే ప్రమాదముంది.
– శంకాస అప్పలనాయుడు, రియల్ వ్యాపారి, విజయనగరం

మోయలేని భారం..



భూముల మార్కెట్ విలువల పెంపు పేద, మధ్య తరగతి కుటుంబాలపై మోయలేని భారంగా మారనుంది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా భూముల ధరలను విపరీతంగా పెంచుతున్నారు. దీంతో ఎవ్వరూ భూములను కొనలేని పరిస్థితి నెలకొంటుంది. రియల్ వ్యాపారం ఇప్పటికే కుదేలైంది. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం పెంపు నిర్ణయం సరికాదు.
– బొత్స శ్రీను, రియల్టర్

ఆర్థిక సాయం..



నెల్లిమర్ల మండలంలోని కొండగుంపాం గ్రామానికి చెందిన పొన్నాడ భవానీ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భవానీకి శస్త్రచికిత్స చేయాల్సి ఉంది. ఇందుకు రూ. పది లక్షలు ఖర్చు కానున్న నేపథ్యంలో గ్రామానికి చెందిన ఎక్సలెంట్ యూత్ సభ్యులు స్పందించి రూ.53 వేలు సేకరించి సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు. – నెల్లిమర్ల రూరల్

మర్యాదపూర్వక కలయిక..

బొబ్బిలి సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా జి. భవ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఎస్పీ వకుల్ జిందల్‌ను స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.
– విజయనగరం క్రైమ్



అధ్వాన రహదారులు

నెల్లిమర్ల రూరల్: మండల వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా మారడంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నెల్లిమర్ల – రణస్థలం ప్రధాన రహదారిలో గొర్లిపేట సమీపంలోని టీఆర్‌టీఎస్ కెనాల్ బ్రిడ్జి వద్ద పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే బొప్పడాం నుంచి జోగిరాజుపేటకు వెళ్లే రహదారి పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెల్లిమర్ల పట్టణంలో పలు రోడ్లపై ఏర్పడిన గుంతలను ఇటీవలే పూడ్చినా రెండు రోజులకే మళ్లీ గోతులు బయటపడ్డాయి. ఇవేమి పనులంటూ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రధానంగా నెల్లిమర్ల – రణస్థలం రహదారి విస్తరణ పనులు మధ్యలో నిలిచిపోవడంతో అడుగుకో గుంత ప్రయాణికులకు దర్శనమిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగుచర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



గొర్లిపేట టీఆర్‌టీఎస్ కెనాల్ బ్రిడ్జి వద్ద అధ్వాన రహదారి

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



డెంకాడ: గొర్రెలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్యాధికారి శ్రీకాంత్

- పశు వైద్యాధికారి శ్రీకాంత్

డెంకాడ: గ్రామాల్లో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశు వైద్యశిబిరాలను రైతులు వినియోగించుకోవాలని అక్కివరం పశువైద్యాధికారి శ్రీకాంత్ కోరారు. మండలంలోని ఆర్.తమ్మాపురంలో సోమవారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 103 పశువులకు నట్టల నివారణ మందు. వందలాది మూగజీవాలకు సాధారణ చికిత్సలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పుర్రె సంతోషి, రైతులు పాల్గొన్నారు.

స్పందన

పూసపాటిరేగ: మండలంలోని చౌడువాడలో నిర్వహించిన పశు వైద్యశిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. శిబిరంలో 52 పశువులకు సాధారణ వైద్య పరీక్షలు, 25 పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు, మరికొన్ని పశువులు, మూగజీవాలకు నట్టల నివారణ మందు వేసినట్లు పశువైద్యాధికారి యు. రాజేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొయ్య సన్యాసమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.



పూసపాటిరేగ: పశువును పరీక్షిస్తున్న వైద్యాధికారి రాజేశ్వరి

వైభవంగా కొనసాగుతున్న అఖండనామ సప్త సప్తాహం



స్వామికి అభిషేకాలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో శివ పంచాక్షరీ మహా మంత్ర అఖండ నామ సప్త సప్తాహం వైభవంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా స్వామికి సోమవారం ఉదయం పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలు, సముద్ర నదీ జలాలతో విశేష అభిషేకాలను అర్చకులు జరిపించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ..మార్చి నెల 9వ తేదీ వరకు మొత్తం 49 రోజులు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మాస శివరాత్రి పర్వదినాన ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు. మార్చి 9న పూర్ణాహుతి కార్యక్రమంతో సప్తాహం పూర్తవుతుందన్నారు.

కాస్వి ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

- వివరాలు వెల్లడించిన ఆస్పత్రి ఎం.డి ప్రవీణ్‌కుమార్

విజయనగరం ఫోర్ట్: కాస్వి ఆస్పత్రిలో గుండెకు సంబంధించిన అరుదైన టావి (ట్రాన్స్‌క్యాథేటర్ అయోర్టిక్ వాల్వ్ ఇంప్లాంటేషన్) శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి ఎం.డి డాక్టర్ మోపాడ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో మొట్టమొదటిసారిగా ఇటువంటి శస్త్రచికిత్సను నిర్వహించామని తెలిపారు. పట్టణానికి చెందిన 74 సంవత్సరాల వ్యక్తి అయోర్టిక్ వాల్వ్ స్టెనోసిస్‌తో బాధపడుతూ కాస్వి ఆస్పత్రికి వచ్చారని చెప్పారు. ఆ వ్యక్తికి గంట సమయంలోనే ఎటువంటి కట్ లేకుండా తొడ రక్తనాళం ద్వారా వైర్ పంపించి గుండె కవాటం మార్పిడి శస్త్రచికిత్స చేశామని తెలిపారు. ఈ శస్త్రచికిత్సను ఇంటర్వేషన్ కార్డియాలజిస్ట్ డాక్టర్ బొబ్బిలి రవికిశోర్, మత్తు వైద్యుడు బాలకృష్ణ చేశారన్నారు.

వైభవంగా వేమాలమ్మ తీర్థం

వేపాడ: మండలంలోని ఆతవ గ్రామదేవత వేమాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం సోమవారం వైభ వం గా నిర్వహించారు.గ్రామస్తులు సాయంత్రం అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అలాగే అరిగిపాలెంలో రెండోరోజు చుక్కమాంబ అమ్మవారి తీర్థం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పూజలందుకుంటున్న వేమాలమ్మ తల్లి

అంతిమ సంస్కారాలకు అవస్థలు



అడవిని తలపిస్తున్న పూసపాటిరేగ పెదచెరువు సమీపంలో శ్మశానవాటిక

- ముళ్లపొదలతో నిండిన శ్మశానం
- అంత్యక్రియలు జరపాలంటే తప్పని నరకయాతన

పూసపాటిరేగ: మనిషి జీవితం ముగిసిన తరువాత చేయాల్సిన అంతిమ సంస్కారాలకు అవస్థలు తప్పడం లేదు. చనిపోయిన తరువాత చేయాల్సిన దహన సంస్కారానికి అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి. కాలం చేసిన తరువాత శ్మశానం వరకు శవయాత్ర చేసుకుని రావాలంటే జాతీయరహదారి రెయిలింగ్‌లపై నుండి మృతదేహాన్ని అవతలకు చేర్చాలి. అక్కడి నుంచి శ్మశానవాటిక వద్దకు వెళ్లడానికి బిక్కుబిక్కుమంటూ జాతీయరహదారిపై వాహనాలను తప్పించుకుంటూ శవయాత్ర చేసి శ్మశానం వద్దకు వెళ్లడం ఒక ఎత్తైతే.. ఆ శ్మశానంలో అంతిమ సంస్కారాలు చేయడానికి కనీస సౌకర్యాలు ఉండవు. కనీసం తలకొరివి పెట్టడానికి కుండలో నీటికి కూడా నోచుకోక తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి పూసపాటిరేగలోని భూడివీధి, యాతపేట, పద్మాశాలివీధి శ్మశానాలది. ఎంతో మంది అధికారులు, ప్రజాప్రతినిధులు శ్మశానం నిర్మిస్తామని ఇచ్చిన హామీలు అన్ని నీటి మూటలుగానే మిగులుతున్నాయి. పూసపాటిరేగలో అంత్యక్రియలు జరపడానికి శ్మశానవాటిక సక్రమంగా లేకపోవడంతో సుమారు 4 వేల మంది ప్రజలు ఉన్న గ్రామంలో దహన సంస్కారాలు చేయడానికి గ్రామస్తులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. అంతిమ సంస్కారాల్లో ప్రశాంతంగా కర్మకాండలు చేయలేని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్మశానంలో అంత్యక్రియలు నిర్వహించే సమయంలో ప్రధానంగా కావాల్సిన నీటి సౌకర్యం శ్మశానంలో లేకపోవడంతో పూసపాటిరేగలోని బూడివీధి, యాతవీధి, పద్మశాలివీధి వాసులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. కెల్లవీధి, రజక వీధి, మహంతివీధికి చెందిన కొవ్వాడ రోడ్డులో శ్మశానంలోని పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉంది. అక్కడ షెడ్డు, దహన సంస్కారాలు చేయాల్సిన పరికరం లేదు. దశాబ్దాలుగా పూసపాటిరేగ పెదచెరువు గట్టు శ్మశానం, కొవ్వాడ రోడ్డులో శ్మశానాల్లో పరిస్థితి దయనీయంగా తయారైంది. మండలంలో చాలా చోట్ల ఉపాధిహామీ నిధులతో శ్మశానాలు నిర్మించారు. కానీ పూసపాటిరేగలో ఉన్న రెండు శ్మశానాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శ్మశానాల్లో కనీసం మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

శ్మశానాల పరిస్థితి అధ్వానం



పూసపాటిరేగ గ్రామంలో పెదచెరువు గట్టు, కొవ్వాడ రోడ్డులో గల శ్మశానాల పరిస్థితి అధ్వానంగా ఉంది. శ్మశానాల్లో కనీసం మౌలిక సదుపాయాలు లేకపోవడంతో దహనసంస్కారాలకు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. పెదచెరువు గట్టు సమీపంలో ఉన్న శ్మశానం అడవిని తలిపిస్తోంది. వర్షం వచ్చిందంటే మృతదేహాలను సైతం పరదాలు వేసి గంటల సమయం పాటు ఉంచాల్సిన దుస్థితి. అధికారులు శ్మశానాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఇప్పటికే శ్మశానవాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాం.
– ఇమంది అప్పారావు, పూసపాటిరేగ గ్రామస్తుడు

ప్రజా సమస్యలను పరిష్కరించలేని పదవులెందుకు..?

- తాము గౌరవం కోసం పని చేస్తున్నాం
- ఎస్.కోట మేజర్ పంచాయతీ సర్పంచ్ తీరుపై వార్డు మెంబర్లు అసహనం

శృంగవరపుకోట: తాము గౌరవం కోసం పని చేస్తున్నామని పంచాయతీలో చేసే పనులు, ప్రతిపాదనల గురించి చెప్పాల్సిన అవసరం లేదా అంటూ ఎస్.కోట మేజర్ పంచాయతీ వార్డు సభ్యులు సర్పంచ్ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. స్థానిక పంచాయతీ కార్యాల యంలో సర్పంచ్ సంతోషి కుమారి అధ్యక్షతన, ఈఓ అనూరాధ నేతృత్వంలో పంచాయ తీ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. గత రెండు దఫాలు వాయిదా పడ్డ సమావేశం ఈసారి సజావుగా సాగింది. సభలో వైస్ సర్పంచ్ మోపాడ కుమార్ మాట్లాడుతూ అభివృద్ధిని అడ్డుకోవడం తమ ఉద్దేశం కాదని, వార్డు సభ్యులకు కనీస గౌరవం, సమాచారం ఇవ్వకపోవడం వల్లనే గత రెండు సమావేశాలు బహిష్కరించామ ని తెలిపారు. పంచాయతీలో చేసే పనుల గురించి, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు వార్డు మెంబర్లకు సర్పంచ్ కనీస సమాచారం ఇవ్వకపోతే తాము వార్డు మెంబర్లుగా ఉండి దేనికని ప్రశ్నించారు. వార్డులో ప్రజల సమస్యల ను పరిష్కరించ లేకుంటే ఈ పదవి ఎందుకు అంటూ నిలదీశారు.వార్డుమెంబర్ కాపుగంటి వాసు ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం తొమ్మిది అంశాలతో పొందిపరిచిన అజెండాను సర్పంచ్ సభ ముందు ఉంచారు.ఇంటిపన్నులు, జనన-మరణాలు, మార్కెట్, కబేళా, సులభ్ కాంప్లెక్స్, వారపు సంతలకు అప్‌సెట్ ప్రైస్ ఆమోదం, టెండర్లకు పత్రికా ప్రకటన, గ్రంథాల య భవనం ప్లాన్ అప్రూవల్ అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. రేగ పుణ్యగిరికి రోడ్డు నిర్మాణం కోసం తీర్మానం చేసి ఇవ్వాలన్న ఈఓ ప్రతిపాదనను సభ్యులు అనుమతించారు. శివరాత్రి జాతరకు నిధుల కేటాయింపుపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని తీర్మానించారు. ప్రస్తుతం దర ఖాస్తు చేసుకున్న ప్లాన్ అప్రూవల్స్, జమా,ఖర్చులు, కొత్త ట్రాక్టర్ కొనుగోలు అంశాలను ఆమోదించలేదు. సర్పంచ్ సంతోషికుమారి మాట్లాడుతూ వార్డులో చేసే పనులకు సంబంధించిన సమాచారం ముందుగా చెబుతామని, అందరూ సమన్వయంతో పట్టణాభివృద్ధికి సహకారం అందించాలని సభ్యులను కోరారు.పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ సర్పంచ్ మోపాడ కుమార్